పుట్టాలమ్మకు సారె సమర్పణ

మండలంలోని తొండమనాడు గ్రామం వద్ద వెలసిన పుట్టాలమ్మకు ఆదివారం రాత్రి విశేష పూజలు నిర్వహించారు. అమ్మవారికి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు సారె సమర్పించారు. వారికి స్థానిక నాయకులు, గ్రామస్తులు స్వాగతం పలికారు. పుట్టాలమ్మకు ఎమ్మెల్యే పూజలు చేశారు. వారి వెంట శ్రీకాళహస్తీశ్వరాలయ చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు ఉన్నారు. - శ్రీకాళహస్తి



సారె తీసుకెళుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి దంపతులు

క్లుప్తంగా

అందుబాటులో ఎరువులు



బుచ్చినాయుడుకండ్రిగలోని ఆర్బీకేకు వచ్చిన యూరియా

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని రైతు భరోసా కేంద్రంలో రసాయనిక ఎరువులు అందుబాటులో ఉన్నాయని, రైతులు తీసుకుపోవచ్చునని మండల వ్యవసాయ సహాయకురాలు రేవతి తెలిపారు. వరి, వేరుశనగ, మినుము, పంటలను సాగు చేస్తున్న రైతులు తప్పనిసరిగా ఈ– క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు. ఈ–క్రాప్ పంట నమోదు చేసుకుంటేనే ప్రభుత్వం అందించే రాయితీలు అందుతాయని చెప్పారు. ఆధార్, పొలం, బ్యాంకు పాసుబుక్కుల జెరాక్స్, ఫోన్ నెంబరులను అందజేసి ఈ– క్రాప్ నమోదు చేసుకోవాలన్నారు.

ప్రభుత్వ భూమిని చదును చేస్తున్న జేసీబీ, ట్రాక్టర్ సీజ్



సీజ్ చేసిన జేసీబీ, ట్రాక్టరు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని సీర్పాకోట గ్రామ రెవెన్యూ పరిధిలోని కాంపాళెం గిరిజన కాలనీ వద్ద గుంట పోరంబోకు ప్రభుత్వ భూమిని ఆక్రమించుకోవటానికి చదును చేస్తున్న జేసీబీ, ట్రాక్టరును ఆదివారం సీజ్ చేసినట్లు వీఆర్‌ఓ జగదీష్ తెలిపారు. గుంట పోరంబోకు ప్రభుత్వ భూమిలో ఉన్న చెట్లు, పుట్టలను తొలగించి ఆక్రమించుకోవడానికి కొందరు ప్రయత్నించారని పేర్కొన్నారు. దీంతో భూమి చదును చేస్తున్న జేసీబీ యంత్రం, ట్రాక్టరును సీజ్ చేసి స్థానిక పోలీసుస్టేషన్‌లో అప్పగించినట్లు తెలిపారు. ప్రభుత్వ భూముల్లో ప్రవేశిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు.

అన్నదానం



అన్నదానం చేస్తున్న దాతలు

ఏర్పేడు: మండలంలోని రాజులపాలెం ఎస్టీ కాలనీలో ఆదివారం యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో అన్నదానం జరిగింది. తిరుపతికి చెందిన పూసపాటి రెడ్డి చరణ్ జన్మదినం సందర్భంగా కాలనీలోని కటుంబాలకు అన్నదానం చేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో యువనేస్త అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్, మండల కో–ఆర్డినేటర్ అరుణ, లక్ష్మి, ముత్యాలమ్మ, గ్రామస్తులు పాల్గొన్నారు.

ఆటో కార్మికులను ఆదుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న కార్మికులు

శ్రీకాళహస్తి: ఆటో కార్మికులను ప్రభుత్వం ఆదుకోవాలని ఆటోనగర్ యూనియన్ అధ్యక్షుడు గోపినాయుడు కోరారు. పట్టణంలోని ఆటోనగర్ యూనియన్ కార్యాలయంలో ఆదివారం ఆటో కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 40 ఏళ్లుగా సుమారు 500 కుటుంబాలు ఆటో మెకానిక్ కార్మికులుగా జీవనం సాగిస్తున్నారన్నారు. అయితే చాలా మందికి కనీసం సొంతిల్లు లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో కార్మికులు మోహన్, మునిగోపాల్, సాదిక్‌బేగ్, సుబ్రహ్మణ్యం, తిరుపాల్‌రెడ్డి, గోపాల్, మీర్జాన్ బేగ్, చిరంజీవులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో వృద్ధురాలు మృతి



శ్రీకాళహస్తి: రోడ్డు ప్రమాదంలో గుర్తు తెలియని వృద్ధురాలు (50) మృతి చెందింది. ఒకటో పట్టణ సీఐ అంజుయాదవ్ కథనం మేరకు.. ఆదివారం మిట్టకండ్రిగ వద్ద ఓ వృద్ధురాలు జాతీయ రహదారి దాటే క్రమంలో శ్రీకాళహస్తి నుంచి తిరుపతి వైపు వెళుతున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆమె అక్కడికక్కడే మృతి చెందింది. సీఐ అంజుయాదవ్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. మృతురాలి వివరాలు తెలియకపోవడంతో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రి మార్చురీకి తరలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నేడు ఖాదీ ఫెస్ట్ ప్రారంభం

తిరుపతి కల్చరల్: దేశవ్యాప్తంగా ఖాదీ ఉత్పత్తులను పెంచాలనే లక్ష్యంతో ఖాదీ వారోత్సవాలను ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు నిర్వహించాలని కేంద్రం ఇచ్చిన ఆదేశాల మేరకు సోమవారం తిరుపతిలోని పాత వెంకటేశ్వర థియేటర్ వద్దనున్న ఎస్‌ఆర్ కన్వెన్షన్ హాల్‌లో ఖాదీ ఫెస్ట్ ప్రారంభిస్తున్నట్లు ఖాదీ విలేజ్ ఇండస్ట్రీస్ సీఈవో వీఆర్ విజయరాఘవ నాయక్ తెలిపారు. రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ చేతుల మీదగా ప్రారంభించనున్నట్లు తెలిపారు. ఈమేరకు ఆదివారం సాయంత్రం ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడారు. ఈ నెల 30 నుంచి నవంబర్ 8వ తేదీ వరకు ఈ ఖాదీ ఫెస్ట్ నిర్వహిస్తామని తెలిపారు.

రామ మందిరాల నిర్మాణానికి నిధుల పత్రాలు



నిధుల పత్రాలు అందజేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: నియోజకవర్గంలోని పలు ఎస్సీ, ఎస్టీ కాలనీ గ్రామాల్లో శ్రీరామ భజన మందిరాల నిర్మాణం కోసం ఎమ్మెల్యే నిధుల పత్రాలను అందజేశారు. ఆదివారం పట్టణంలోని వైఎస్‌ఆర్ సీపీ కార్యాలయంలో వాటిని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తిరుమల తిరుపతి దేవస్థానం, దేవదాయ శాఖ సహకారంతో శ్రీవాణి ట్రస్టు నిధులతో నియోజవకర్గంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో నిర్మిస్తున్న 32 రామమందిర నిర్మాణాలకు ఒక్కొక్క మందిరానికి రూ.10 లక్షలు వంతున మొత్తం రూ.3.20 కోట్లు అందజేసినట్లు తెలిపారు.

వీల్ చైర్లు వితరణ



వీల్‌చైర్లు అందజేస్తున్న రైల్వే బోర్డు సభ్యుడు మురళి

రేణిగుంట: ప్రయాణికుల సౌకర్యార్థం రేణిగుంట రైల్వేస్టేషన్‌కు ఆదివారం రూ.30 వేలు విలువ చేసే 3 వీల్ చైర్లు తిరుమల కన్యకాపరమేశ్వరి ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో పంపిణీ చేశారు. సౌత్ సెంట్రల్ రైల్వే గుంతకల్ డివిజన్ బోర్డు సభ్యులు మురళి చేతుల మీదుగా అందజేశారు. దివ్యాంగ ప్రయాణికుల సౌకర్యార్థం వీటిని ఉపయోగించాలని కోరారు. కన్యకాపరమేశ్వరి దేవస్థానం అధ్యక్షుడు సత్యనారాయణ శెట్టి, శ్రీనివాసులు, తేజయశస్వి, రామకృష్ణారావు, గోవిందరాజులు, వెంకటేష్, రవీంద్రబాబు పాల్గొన్నారు.

బ్యాడ్మింటన్ టోర్నీ విజేతలకు బహుమతులు



నగదు, జ్ఞాపికలు అందుకున్న విజేతలు

ఏర్పేడు: కొత్తకాల్వ గ్రామంలోని కృషి బ్యాడ్మింటన్ అకాడమీ ఆధ్వర్యంలో ఆదివారం జరిగిన టోర్నమెంట్‌లో విజేతలకు బహుమతులు అందజేశారు. అకాడమీ ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా గురునాథ హార్డ్ వేర్స్, జై డోర్స్ సంస్థ ఈ టోర్నమెంట్ నిర్వహించాయి. వివిధ ప్రాంతాల నుంచి పలువురు క్రీడాకారులు హాజరయ్యారు. తిరుపతికి చెందిన శశిభూషణరావు, శరత్‌కుమార్, రన్నర్స్‌గా చక్రధర్‌రెడ్డి, మహమ్మద్ వసీం గెలుపొందారు. విజేతలకు నగదుతో పాటు మెమొంటోలు అందజేశారు. కార్యక్రమంలో చంద్రశేఖర్‌రెడ్డి, రూపస్, లోకేష్, కేశవులు, కిరణ్ మధు తదితరులు పాల్గొన్నారు.

కోలా ఆనంద్‌కు సన్మానం



ఆనంద్‌ను సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

శ్రీకాళహస్తి: బీజేపీ రాష్ట్ర కార్యదర్శి, నియోజకవర్గ ఇన్‌చార్జ్ కోలాఆనంద్‌ను ఆదివారం ఆ పార్టీ ఓబీసీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు ఎస్‌వీ రమణ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తనకు పదవి రావడానికి కృషి చేసిన కోలా ఆనంద్‌కు కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని కోలా ఆనంద్ వారికి సూచించారు.

రాష్ట్ర స్థాయి పోటీలకు వరదయ్యపాళెం హైస్కూల్ విద్యార్థులు



ప్రవల్లిక



మోహిత్‌రెడ్డి



యాషిక

వరదయ్యపాళెం: రాష్ట్ర స్థాయిలో జరిగే క్రీడా పోటీలకు వరదయ్యపాళెం హైస్కూల్‌కు చెందిన విద్యార్థులు ఎంపికైనట్లు పీడీ బందిల కుమార్ తెలిపారు. అండర్–17 కేటగిరీలో పదో తరగతి విద్యార్థులు ప్రవల్లిక (సాఫ్ట్‌బాల్), మోహిత్‌రెడ్డి (బాల్ బ్యాడ్మింటన్), యాషిక (బాల్ బ్యాడ్మింటన్) ఎంపికయ్యారు. వీరు నవంబర్ 3వ తేదీ నుంచి కృష్ణా, ఒంగోలు ప్రాంతాల్లో రాష్ట్ర స్థాయిలో జరిగే పోటీల్లో పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రమాదకరంగా కల్వర్టు



పెద్దపాండూరు రోడ్డులో రక్షణ గోడ లేని కల్వర్టు

వరదయ్యపాళెం: మండలంలోని పెద్దపాండూరు– వరదయ్యపాళెం రోడ్డులోని పాండూరు చెరువు వద్ద కల్వర్టు ప్రమాదకరంగా ఉందని, రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. ఇక్కడ గతంలో పెద్దపాండూరు చెరువు నుంచి పంట పొలాలకు సాగునీరు వెళ్లేందుకు కల్వర్టు ఏర్పాటుచేశారు. దానికి రెండు వైపులా రక్షణ గోడ నిర్మించలేదు. దీంతో అటువైపు వెళ్లే ద్విచక్ర వాహనాలు, పెద్ద వాహనాలు తరచూ ప్రమాదానికి గురవుతున్నాయి. ఇదే కల్వర్టు వద్ద ఇటీవల కొయ్యల లోడ్‌తో వస్తున్న ట్రాక్టర్ ప్రమాదానికి గురై డ్రైవర్ దుర్మరణం చెందాడు. ఇప్పటికైనా ఆర్ అండ్ బీ అధికారులు స్పందించి రక్షణ గోడ నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు.

అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని నిరసన



ఆర్‌అండ్‌బీ రోడ్డుపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట గ్రామస్తులు అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని కోరుతూ ఆరులేన్ల ఆర్‌అండ్‌బీ రోడ్డుపై ఆదివారం నిరసన చేశారు. ఆరులేన్ల అభివృద్ధి పనుల్లో భాగంగా తమ గ్రామం వద్ద అండర్ బ్రిడ్జి ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారుల చుట్టు తిరుతున్నా ఫలితం లేకుండా పోతోందని తెలిపారు. అండర్ బ్రిడ్జి లేనందున రైతులు అటవీప్రాంతాలకు సమీపంలోని వ్యవసాయ పొలాలు, పశువుల మేతకోసం, శ్మశానానికి వెళ్లలేక ఇబ్బందులు పడుతున్నట్లు వివరించారు. అండర్‌బ్రిడ్జి ఏర్పాటు చేసేంతవరకు పోరాటం చేస్తామని తెలిపారు.

పద్య పఠన పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన తపస్య స్కూల్ విద్యార్థులు

రేణిగుంట: రేణిగుంట మండలస్థాయిలో నిర్వహించిన వేమన పద్యానికి పట్టాభిషేకం కార్యక్రమంలో పద్య పఠన విభాగంలో రేణిగుంట డాక్టర్ బషీర్స్ తపస్య స్కూల్ విద్యార్థులు ప్రతిభ చూపినట్లు విద్యాసంస్థల అధినేత విక్రమ్‌శాలీ తెలిపారు. వేమన విజ్ఞాన కేంద్రం, తిరుపతి బాలోత్సవ్ సంయుక్తంగా ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో తమ పాఠశాల నుంచి మూడు విభాగాల్లో మొత్తం 8మంది విద్యార్థులు విజేతలుగా నిలిచారన్నారు. వారిని తపస్య స్కూల్ డైరెక్టర్ కె.అనూష అభినందించారు.

కనుల పండువగా నరసింహస్వామి కల్యాణం



స్వామి వారికి పూజలు చేస్తున్న అర్చకులు

సైదాపురం(వెంకటగిరి): స్థానిక ఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలోని మదర్ అకాడమీ వద్ద ఆదివారం నరసింహస్వామి, ఆదిలక్ష్మి చెంచులక్ష్మి దేవి కల్యాణం కనుల పండువగా నిర్వహించారు. వైఎస్సార్ సీపీ తిరుపతి జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్ రెడ్డి సారథ్యంలో జరుగుతున్న ధర్మ ప్రచార రథం ఆదివారం వెంకటగిరికి చేరుకుంది. వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ జి.ఢిల్లీబాబు ఆధ్వర్యంలో రథం వెంకటగిరిలోని వరదరాజా స్వామి, ఆంజనేయ స్వామి ఆలయం, పోలేరమ్మ, రాజావీధి, కాశీపేట, తహసీల్దార్ కార్యాలయం మీదుగా తూర్పువీధి, పాత బస్టాండ్, ఎస్‌ఆర్ కల్యాణ మండపం వరకు సాగింది. పోలేరమ్మ ఆర్చి వద్దకు చేరుకున్న స్వామి వారి రథాన్ని వెంకటగిరి రాజా వారసులు స్వర్ణజ్ఞ కుమార యాచేంద్ర దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం స్థానిక ఎస్‌ఆర్ కల్యాణ మండపం సమీపంలోని మదర్ అకాడమీ వద్ద ఏర్పాటు చేసిన మండపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవ మూర్తులకు కనుల పండువగా కల్యాణం నిర్వహించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ నక్కా భానుప్రియ, విప్ లక్ష్మి, కౌన్సిలర్లు కల్యాణి, చంద్రారెడ్డి, ఈవో జనార్దన్‌రెడ్డి, పోలేరమ్మ ఆలయ కమిటీ మాజీ అధ్యక్షుడు పులిమి ప్రసాద్‌రెడ్డి, పెంచలకోన ఆలయ ప్రధాన అర్చకులు సీతారామయ్యస్వామి, పెంచలయ్య స్వామి అర్చకులు మల్లికార్జున స్వామి, శశిస్వామి, వినోద్‌స్వామి, సూర్యస్వామి, ప్రసాద్‌స్వామి, నాగరాజస్వామి తదితరులు పాల్గొన్నారు.



కల్యాణానికి హాజరైన భక్తులు

డ్రైవర్‌పై దాడి చేసిన వారిని అరెస్టు చేయాలి



ఆందోళన చేస్తున్న ఆర్టీసీ డ్రైవర్లు, కండక్టర్లు, సిబ్బంది

సత్యవేడు: కావలి సమీపంలోని మద్దూరుపాడు వద్ద ఆర్టీసీ డ్రైవర్‌పై దాడి చేసిన రౌడీమూకను అరెస్టు చేయాలని ఆర్టీసీ డ్రైవర్లు, సిబ్బంది, కండక్టర్లు డిమాండ్ చేశారు. వారు ఆదివారం సత్యవేడు గ్యారేజ్ సమీపంలో ఎస్‌ఎంయూఏ, ఈయూ, వైఎస్సార్ ఈఏ యూనియన్లతో కలిసి నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. నాయకులు మాట్లాడుతూ బెంగళూరు నుంచి విజయవాడ వెళుతున్న ఆర్టీసీ బస్సుకు కావలి ట్రంక్ రోడ్డులో ట్రాఫిక్‌కు అడ్డుగా ఉన్న వాహనాన్ని తొలగించమని హారన్ కొట్టినందుకు ఆర్టీసీ డ్రైవర్‌ను బస్సు నుంచి దింపి తీవ్రంగా కొట్టడం దారుణమన్నారు. దాడికి పాల్పడిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఆర్టీసీ కార్మికుల నిరసన

శ్రీకాళహస్తి: పట్టణంలోని ఆర్టీసీ డిపో ఆవరణలో ఆదివారం డ్రైవర్లు, కండక్టర్లు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కావలి బైపాస్‌రోడ్డు వద్ద విజయవాడ ఆటోనగర్ డిపోకు చెందిన డ్రైవర్‌పై కొందరు దుండగులు దాడి చేయడం దారుణం అన్నారు. దాడి చేసిన వారిని కఠినంగా శిక్షించాలని కోరారు. మరోసారి ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలన్నారు.



నిరసన తెలుపుతున్న ఆర్టీసీ కార్మికులు

పనులు వేగవంతం చేయండి



పనులను పరిశీలిస్తున్న చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు

శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా పట్టణంలో వెలసిన శ్రీప్రసన్న వరదరాజస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులను వేగవంతం చేయాలని పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ఈవో సాగర్‌బాబు తెలిపారు. ఆదివారం వారు పునర్నిర్మాణ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇకపై ప్రతిరోజు యుద్ధప్రాతిపదికన పనులు చేయాలన్నారు. ఎలాంటి జాప్యాన్ని సహించబోమని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు నూకరత్నం, శ్రీనివాసులురెడ్డి, కిషోర్‌కుమార్, సూర్యప్రసాద్, స్థపతికుమార్, కాంట్రాక్టర్లు యువకిషోర్, విజయభాస్కర్‌రెడ్డి, అధికారులు పాల్గొన్నారు.

సీఐని దూషించిన సుధీర్‌రెడ్డిని అరెస్ట్ చేయాలి

- ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘ నేతలు డిమాండ్



మాట్లాడుతున్న ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం నేతలు

తిరుపతి కల్చరల్: శ్రీకాళహస్తి నియోజవర్గం ఏర్పేడు సీఐ అజయ్ కుమార్‌పై అనుచిత వ్యాఖ్యలు చేసి దూషించిన శ్రీకాళహస్తి నియోజకవర్గం టీడీపీ ఇన్‌చార్జ్ బొజ్జల సుధీర్‌రెడ్డిని వెంటనే అరెస్ట్ చేయాలని ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘ నేతలు డిమాండ్ చేశారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు చింతమాకుల పుణ్యమూర్తి మాట్లాడారు. శ్రీకాళహస్తి రూరల్ ప్రాంతం కమ్మ కొత్తూరులో బొజ్జల సుధీర్‌రెడ్డి జగనాసురవధ కార్యక్రమాన్ని చేపడుతుంటే నివారించి పోలీస్‌స్టేషన్‌కు వచ్చి సమగ్ర విషయాల్ని తెలపాలని ఓ పోలీసు అధికారిగా సీఐ అజయ్‌కుమార్ సూచించారన్నారు. దీనిని సహించలేని సుధీర్‌రెడ్డి ఫోన్ ద్వారా సీఐని దుర్భాషలాడుతూ హెచ్చరికలతో భయాందోళనకు గురి చేయడం దారుణమన్నారు. దళిత సీఐను చులకన భావనతో దూషించిన ఆయనను వెంటనే అరెస్ట్ చేయాలని డిమాండ్ చేశారు. దళితులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే అంబేడ్కర్ సంఘం చూస్తూ ఊరుకోదని హెచ్చరించారు. ఈ సమావేశంలో సంఘ నేతలు రామాంజనేయులు, కుమార్, సెల్వకుమార్, మధు పాల్గొన్నారు.

పేదల సేవే మాధవసేవ



ప్రత్యేక ప్రతిభావంతులకు సరుకులు పంపిణీ చేస్తున్న కమిషనర్

శ్రీకాళహస్తి: పేదల సేవే మాధవ సేవ అని శ్రీకాళహస్తి మున్సిపల్ కమిషనర్ రమేష్‌బాబు అన్నారు. పట్టణంలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆధ్వర్యంలో ఆదివారం ప్రత్యేక ప్రతిభావంతులకు నిత్యావసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లాభాపేక్ష లేకుండా ప్రత్యేక ప్రతిభావంతులకు సేవ చేయడం అభినందనీయమన్నారు. అంతేకాకుండా వారు స్వశక్తితో ఎదిగే విధంగా చూడాలన్నారు. ప్రతి ఒక్కరూ తమకున్న దానిలో కొంత పేదలకు సాయం చేయాలన్నారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు మునీర్ బాషా, సభ్యులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్ బాబు, హరినాయుడు తదితరులు పాల్గొన్నారు.

అనుమతి లేకుండా ఇసుక, మట్టి తరలిస్తే చర్యలు



మట్టిని తరలిస్తూ పట్టుబడిన టిప్పర్ లారీలు



పట్టుబడిన ఇసుక ట్రాక్టర్

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని కాళంగినది నుంచి ఇసుక, చెరువులు, ప్రభుత్వ భూముల నుంచి మట్టిని తరలిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని తహసీల్దారు భార్గవి తెలిపారు. పార్లపల్లిలోని ప్రభుత్వ భూమి నుంచి మట్టిని తరలిస్తున్న మూడు లారీలు, కాళంగి నది నుంచి ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్‌ను వీఆర్వోలు ఆదివారం స్వాధీనం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆలత్తూరు, కాటూరు, పల్లమాల గ్రామాల్లోని కాళంగినది నుంచి ఇసుకను అక్రమంగా విచ్చలవిడిగా తరలిస్తున్నారని తెలిపారు. ఇసుక, మట్టిని అక్రమంగా తరలించటం చట్టరీత్యా నేరమన్నారు. ఇసుక, మట్టిని అక్రమంగా తరలిస్తూ పట్టుబడితే కేసు నమోదు చేస్తామని తెలిపారు. ఇసుకను డంప్ చేసే స్మగ్లర్లపై కేసు నమోదు చేస్తామన్నారు. ప్రభుత్వ పనులు, జగనన్న ఇంటి నిర్మాణాల అవసరాల కోసం ఎఈఉల వద్ద పర్మిషన్ తీసుకోవాలన్నారు. తప్పని సరిగా ప్రభుత్వ నిబంధనలను పట్టించాలని, ఇసుక, మట్టిని తరలిస్తూ పలుమార్లు పట్టుబడితే క్రిమినల్ కేసులు పెడతామని హెచ్చరించారు.

శ్మశానానికి దారి కల్పించండి



శ్మశానందారిలో ఉన్న ముళ్లపొదలు



గుంతలమయమైన శ్మశానం రోడ్డు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని వెస్టువరత్తూరులో శ్మశానానికి సరైన దారి కల్పించాలని స్థానికులు కోరుతున్నారు. గ్రామానికి శ్మశానం ఒకటిన్నర కిలోమీటరు దూరంలో ఉందని, దారికి ఇరువైపులా ముళ్లపొదలు పెరగడంతో శవాలను తీసుకుపోవడానికి నానా అవస్థలు పడాల్సి వస్తోందని వాపోతున్నారు. ముళ్లపొదలను తొలగించాలని పలుమార్లు రెవెన్యూ అధికారులకు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని గ్రామస్తులు ఆవేదన చెందుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి శ్మశానానికి దారిని ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.